రహదారుణాలు

రాంబిల్లి మండలంలో ప్రధాన రహదారులు ప్రజలు, ప్రయాణికులను భీతావహులను చేస్తున్నాయి. యలమంచిలి నుండి రాంబిల్లి మండలానికి అప్పారాయుడుపాలెం మీదుగా వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది మంది ప్రయాణికులు, సెజ్ ఉద్యోగులు, మండల కార్యాలయాల అధికారులు ప్రయాణం చేస్తుంటారు. సకాలంలో విధులకు హాజరవుతామనే ఆశతోనే వారు ఈ దారిని ఎంచుకుంటూ ఉంటారు. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినడం వల్ల అటుగా వెళ్లే వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తారు రోడ్డు పైపొర పూర్తిగా పోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి.

- ప్రమాదకరంగా అప్పారాయుడుపాలెం రోడ్డు
- రాంబిల్లి మండలం రహదారులదీ అదే పరిస్థితి
- గుంతలు పడి చెరువులను తలపిస్తున్న రోడ్లు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు, సెజ్ ఉద్యోగులు
- పట్టించుకోని అధికారులు



గోతులమయంగా అప్పారాయుడుపాలెం ప్రధాన రోడ్డు



ప్రమాదకరంగా అప్పారాయుడుపాలెం రహదారి

రాంబిల్లి (యలమంచిలి) : యలమంచిలి నుండి రాంబిల్లి మండలానికి అప్పారాయుడుపాలెం మీదుగా వెళ్లే ప్రధాన రహదారి గత కొన్ని సంవత్సరాలుగా శిథిలమైంది. దీనికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ రోడ్డులో పెద్ద ప్రమాదం జరిగితేనే అధికారులు, ప్రభుత్వంలో స్పందన వస్తుందేమో అని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంబిల్లి మండలంలో అన్ని ప్రధాన రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. గాజువాక, యలమంచిలి బైపాస్ రహదారిలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు యలమంచిలి బైపాస్ రోడ్డును మామిడివాడ కొత్తూరు గ్రామాల వరకు మరమ్మతు చేసింది. ఇంతలో ఎన్నికలు సమీపించడంతో పనులు నిలిచిపోయాయి. పంచదార్ల గ్రామం నుండి అచ్యుతాపురం వరకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. అలాగే వెంకటాపురం జంక్షన్ నుండి రాంబిల్లి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. రోడ్లపై గోతులు ఏర్పడి రాళ్లు తేలి దుమ్ము ధూళి లేచిపోవడం వల్ల ప్రయాణాలు చేయాలంటే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా రోడ్ల దుస్థితిని పట్టించుకోవడం లేదు. అటుగా స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రయాణాలు సాగిస్తున్నా వారికి ఈ రహదారి పరిస్థితి తెలియడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంబిల్లి మండలంలో ప్రధాన రహదారులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరమ్మతులు చేయించినప్పటికీ నేవల్ బేస్‌కి వెళ్లే అధిక లోడు లారీల వల్ల ఆ రోడ్లు దెబ్బతిన్నాయి. అప్పారాయుడుపాలెం రోడ్డు సుమారు 4 కిలోమీటర్ల వరకు పూర్తిగా దెబ్బతింది. పంచదార్ల నుండి అచ్యుతాపురం వరకు గాజువాక యలమంచిలి బైపాస్ రోడ్డు 8 కిలోమీటర్ల మేర గోతులు పడి దెబ్బతింది. రాంబిల్లి మీదుగా ఎస్‌ఈజెడ్, జంగాలపాలెం, రాజకోడూరు, కృష్ణంపాలెం, సంతపాలెం, అప్పన్నపాలెం, జెడ్‌చింతువా గ్రామాల వరకు రోడ్లు దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి రాంబిల్లి మండలంలో అన్ని ప్రధాన రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న యలమంచిలి-గాజువాక బైపాస్ రోడ్డులో ప్రయాణిస్తున్న భారీ వాహనాలు

అధికారులు స్పందించాలి..



ఎస్‌ఈజెడ్ పరిశ్రమలో పని చేసే ఉద్యోగులందరూ అప్పారాయుడుపాలెం రోడ్డు మీదుగా ప్రయాణాలు చేస్తుంటారు. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినడం వల్ల బైక్ మీద వెళ్లినప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అని భయాందోళనలు చెందుతున్నాం. అధికారులు స్పందించి అప్పారాయుడుపాలెం రోడ్డుకు మరమ్మతు చేయాలి.

– దేముడుబాబు, సెజ్ ఉద్యోగి

ఈ రోడ్లలో ప్రయాణమంటేనే భయమేస్తుంది..



రాంబిల్లి మండలంలో అన్ని ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. యలమంచిలి, అచ్యుతాపురం బైపాస్ రోడ్డులో ప్రయాణాలు సాగించాలంటేనే భయంగా ఉంది. బైక్ మీద ప్రయాణించేటప్పుడు గోతుల్లో నుండి దుమ్ము ధూళి లేచి కళ్లల్లో పడి డ్రైవింగ్ చేయడం కష్టంగా ఉంది. అధికారులు త్వరగా రోడ్లకు మరమ్మతు చేపట్టి ప్రయాణికుల కష్టాలు తీర్చాలి.

– కిల్లాడి చిరంజీవి, ప్రయాణికుడు

ప్రతిపాదనలు పంపించాం..

యలమంచిలి, అచ్యుతాపురం ప్రధాన బైపాస్ రోడ్డులో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు కొన్ని చోట్ల దెబ్బతిన్నాయి. వాటిని గుర్తించాం. రోడ్ల మరమ్మతు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గతంలో యలమంచిలి నుండి కొత్తూరు వరకు మరమ్మతులు జరిగాయి. పంచదార్ల నుండి అచ్యుతాపురం వరకు రోడ్డు కొంత మేర దెబ్బతింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే మరమ్మతులు చేపడతాం.

– సత్యవాణి, యలమంచిలి ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

క్లుప్తంగా

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ వర్కర్స్ స్కీమ్ ప్రతినిధి

పాయకరావుపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులపై ప్రభుత్వ ఐ.టి.ఐ. విద్యార్థులకు పీఎల్‌పురంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వర్కర్స్ స్కీమ్ సిబ్బంది, వైద్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెగ్యులేటర్ల అభివృద్ధికి చర్యలు



రైతులతో కలిసి తోటాడ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

మునగపాక : రెగ్యులేటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. మండలంలోని తోటాడ ఆవ కాలువ, అలాగే మూలపేట వద్ద సాగునీటి కాలువల్లోని రెగ్యులేటర్లను రైతుల ఫిర్యాదు మేరకు ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు సాగునీటి పరంగా ఎటువంటి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, పాలమశెట్టి సత్యనారాయణ, ఆడారి జగన్నాథరావు, పలువురు రైతులు ఆయన వెంట ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి



మునగపాక హైస్కూల్లో సమావేశమైన స్కూల్ కమిటీ పాలకవర్గ సభ్యులు

మునగపాక : విద్యాభివృద్ధికి పాలకవర్గం తగు కృషి చేస్తుందని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్య చంద్ర రామారావు, బొడ్డేడ గిరిజ తెలిపారు. బుధవారం హైస్కూల్లో స్కూల్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించడంతో పాటు, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా చూస్తామన్నారు. హైస్కూల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పలువురు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హైస్కూల్, శ్మశాన వాటికల్లో జంగిల్ క్లియరెన్స్



పాములవాక జెడ్పీ హైస్కూల్లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల: పాములవాకలోని కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బుధవారం జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ డి.సత్యవతి ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను ట్రాక్టర్ ద్వారా తొలగింపజేశారు. విద్యార్థుల ఆట స్థలంలో కూడా భారీగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు తుప్పలు తొలగింపజేసినట్టు శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుత వర్షాలకు పొదల్లో విషపురుగులు సంచరించే ప్రమాదం ఉన్నందున చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అదే విధంగా శ్మశాన వాటిక గట్ల వెంబడి పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో అక్కడ కూడా తొలగింపునకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

విజయవాడ విలయం..
ప్రభుత్వ వైఫల్యమే

మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు



యలమంచిలి రూరల్: పబ్లిసిటీ పిచ్చి.. అత్యుత్సాహంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలో వరద బాధితులకు నరకం చూపిస్తున్నారని యలమంచిలి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) విమర్శించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇంతటి జల విలయానికి కారణం చంద్రబాబేనని, ఆయన ఇల్లు మునిగిపోకుండా కాపాడుకునేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగనూరు రెగ్యులేటరీ ద్వారా విజయవాడ మీదకు వదిలేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. వరదలు వస్తాయని ప్రజలను అప్రమత్తం చేయడంలోనూ, వరదల అనంతరం ఆదుకోవడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వరద ప్రమాదం పొంచి ఉందని అధికారులు హెచ్చరించినా రాష్ట్ర పాలకులు స్పందించకపోవడం విచారకరమన్నారు. గోరంత సాయంతో కొండంత ప్రచారం చేసుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. వరద బాధితులకు న్యాయం చేయడంలోనూ, తాగు నీరు, భోజనంతో పాటు నిత్యావసర సరకులు పంపిణీ చేయడంలోనూ, పునరావాస కేంద్రాలకు తరలించడంలోనూ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. వరదలు వచ్చి 10 రోజులైనా ఇంకా కొన్ని ప్రాంతాల్లో వరద నీటిలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తుండడం బాధాకరమన్నారు. వరద బాధితులను పరామర్శించే పేరుతో ప్రతిరోజూ మీడియాలో ప్రచారానికి సీఎం చంద్రబాబుకు ఇచ్చిన ప్రాధాన్యత చూసిన రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. భవిష్యత్‌లో విజయవాడ ప్రజలు వరదల్లో చిక్కుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బియ్యం పంపిణీ వాహనాలను నిత్యం విమర్శించిన టీడీపీ నేతలకు చివరకు అవే దిక్కయ్యాయని ఎద్దేవా చేశారు. ఆ వాహనాల్లోనే వరద బాధితులకు సరకులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో రిటైనింగ్ వాల్ నిర్మించి, విజయవాడలో కొన్ని ప్రాంతాలకు వరద ముప్పు తప్పించారని వివరించారు. రూ. లక్ష కోట్ల ఆస్తి నష్టం సంభవించిందని, ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యత సర్కారుపై ఉందన్నారు.

ప్రమాదాలకు నిలయంగా మునగపాక బైపాస్ జంక్షన్



వాహన చోదకులు, పాదచారులను భయపెట్టే మునగపాక బైపాస్ జంక్షన్

మునగపాక : మునగపాక బైపాస్ జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ జంక్షన్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకవైపు అనకాపల్లి, మరో వైపు అచ్యుతాపురంలోని బ్రాండిక్స్, అలాగే పరవాడలోని పలు కంపెనీలకు నిత్యం వందలాది మంది మునగపాక బైపాస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ జంక్షన్ వద్ద కొంత మంది రోడ్డును ఆనుకుని కూరగాయలు, చేపల అమ్మకాలు చేయడం, మరికొంత మంది ఆటోలను రోడ్డు పక్కగా నిలిపివేస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కోతుల స్వైరవిహారంతో అవస్థలు



కొత్త మహాలక్ష్మి మూల సంఘ రోడ్డులో కోతులు

మునగపాక : మునగపాకలోని పలు ప్రాంతాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో రైతులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పురిటిగెడ్డ, కొత్త మహాలక్ష్మి మూల సంఘాల పరిధిలో నిత్యం కోతులు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి రైతులపై దాడి చేస్తున్నాయంటూ సీపీఎం నేత ఎస్.బ్రహ్మాజీ, రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ తెలిపారు. ఈ మేరకు గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పాలిమేర లక్ష్మి, కొయిలాడ సత్తిబాబుపై ఇటీవల కోతులు దాడి చేశాయన్నారు. దీనికి తోడు కొబ్బరి, అరటి, బొప్పాయి వంటి పంటలకు నష్టం చేకూరుస్తున్నాయంటూ వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు



అడ్డురోడ్డులోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి సౌజన్య

ఎస్.రాయవరం : రైతులను ఇబ్బందులు పెడుతూ ఎరువులు విక్రయిస్తే సహించేది లేదని మండల వ్యవసాయాధికారి సౌజన్య హెచ్చరించారు. అడ్డురోడ్డులోని ఓ ఎరువుల దుకాణంలో పలువురు రైతులు ఎరువుల కొనుగోలుకు వెళ్లి యూరియా అడిగితే పొటాష్ తీసుకోవాలని కండిషన్ పెట్టడంతో రైతులు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వ్యవసాయాధికారి ఆ దుకాణాన్ని పరిశీలించి రైతులు అడిగిన విధంగా విక్రయాలు జరపాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మాలని, ఏ ఒక్కరూ చేతి వాటం ప్రదర్శించినా లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు అవగాహన కల్పించి విక్రయాలు జరపాలని, ఒక రకం ఎరువు అడిగితే మరో రకం ఎరువు లింక్ పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు.

నక్కపల్లి అదనపు ఎంఈవోగా నూకరాజు



ఎంఈవో-2గా నియమితులైన నూకరాజు

నక్కపల్లి : మండల అదనపు విద్యాశాఖాధికారి (ఎంఈవో-2)గా సీనియర్ ప్రధానోపాధ్యాయుడు వేమగిరి నూకరాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన దేవవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. నూకరాజును ఎంఈవో-2గా నియమిస్తూ విద్యాశాఖ నుంచి బుధవారం ఆదేశాలు వచ్చాయని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా నూకరాజుకు వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీల నాయకులు అభినందనలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తారని నూకరాజు తెలిపారు.

పేపర్‌బాయ్ మృతికి సంతాపం



నూకరాజు (ఫైల్)

ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరంలో సుదీర్ఘంగా పేపర్‌బాయ్‌గా పని చేసిన తుమ్మపాల నూకరాజు (68) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. చిన్న వయస్సు నుంచి సుమారు 35 ఏళ్ల పాటు మండల కేంద్రం పాఠకులకు న్యూస్ పేపర్ అందించేవారు. నూకరాజు పేరు చెబితే అన్ని రకాల న్యూస్ పేపర్లు ఉంటాయని పాఠకుల నమ్మకం. పూర్వం ప్రచురితమయ్యే ఆంధ్రపత్రిక నుంచి నేటి తరంలో దూసుకుపోతున్న సాక్షి వరకు నూకరాజు పేపర్ ఏజెంటుగా పని చేశారు. గత కొన్నేళ్లుగా ఆరోగ్యం సహకరించక ఇంటి వద్దే ఉంటున్నారు. బుధవారం తుదిశ్వాస విడిచారని గ్రామస్తులు చెబుతున్నారు. నూకరాజు మృతి వార్త విన్న స్థానిక నేతలు, పాఠకులు సంతాపం తెలిపారు

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదు



దుప్పుతూరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (మునగపాక) : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని లింక్ వర్కర్ స్కీమ్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరులో బుధవారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రమీల, అంగన్‌వాడీ టీచర్ పద్మ, సీఎల్ డబ్ల్యు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం



బ్లీచింగ్ పిచికారీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : రోగాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. ఇటీవల వర్షాలు కురిసిన నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామంలో జరుగుతున్న బ్లీచింగ్ పిచికారీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



విద్యార్థుల కళ్లను పరీక్షిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: విద్యార్థులు కళ్లను సురక్షితంగా చూసుకోవాలని కంటి వైద్య నిపుణులు బొండా వెంకట్రావు అన్నారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన విద్యార్థులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళ్లద్దాలు అవసరమైన వారి వివరాలు తీసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ కంటి చూపు మెరుగుపడే ఆహారం ఎక్కువగా తీసుకుని ఆరోగ్యకరమైన చూపు పొందాలన్నారు.

రాంబిల్లి ఎస్ఐగా నాగేంద్ర బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ నాగేంద్రను అభినందిస్తున్న సీఐ నరసింగరావు

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి ఎస్ఐగా డి.నాగేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేసి బదిలీపై రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌కు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగేంద్ర మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు, మైనర్ డ్రైవింగ్‌లు, మాదక ద్రవ్యాలు అరికట్టేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయనను సీఐ నరసింగరావు అభినందించారు.

ఎస్ఐ రమణయ్యకు బదిలీ

కోటవురట్ల : ఎస్ఐ రమణయ్యకు బదిలీ అయింది. అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే పలువురు ఎస్ఐలకు బదిలీ కాగా తాజాగా కోటవురట్ల ఎస్ఐ రమణయ్యకు సీఎంఎస్ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయింది. అనకాపల్లి టౌన్ పీఎస్ నుంచి ఎస్ఐ సింకా రమేష్ బదిలీపై కోటవురట్లకు రానున్నారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా ఎస్పీ నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం : కొరుప్రోలు నుంచి బంగారమ్మపాలెం విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం గురువారం కొన్ని గ్రామాలకు, పలు పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. సోమిదేవపల్లి 24 గంటల విద్యుత్ సరఫరా ఫీడర్, గుడివాడ, గుర్రాజుపేట పరిశ్రమలకు, గుడివాడ ఫీడర్‌పై ఉన్న గుడివాడ, పెదఉప్పలం, ఎల్‌పీఆర్‌పేట, కొత్తరేవుపోలవరం, రేవుపోలవరం, బంగారమ్మపాలెం, చినఉప్పలం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంగాదేవిపేటలో డీఎల్‌పీవో విచారణ



గంగాదేవిపేటలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో మూర్తి

మునగపాక : మండలంలోని గంగాదేవిపేటలో బుధవారం డీఎల్‌పీవో మూర్తి విచారణ చేపట్టారు. గంగాదేవిపేట ఎస్సీ కాలనీలో కుళాయి పైప్‌లైన్ పనుల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించకుండా తనను అవమానించిన ఉపసర్పంచ్ భర్త రామచంద్రరావుపై వార్డు సభ్యురాలు వాకపల్లి నూకాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూర్తి విచారణ చేపట్టారు. ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని మూర్తి తెలిపారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన



ఎమ్మెల్యే విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన క్రీడాకారులు

అచ్యుతాపురం (మునగపాక) : క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అక్కిరెడ్డిపాలెంలోని ఫిట్నెస్ అండ్ బాక్సింగ్ క్లబ్ విద్యార్థులు పతకాలు సాధించిన నేపథ్యంలో బుధవారం విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ గత నెల 29,30 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన 9వ రాష్ట్ర అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీల్లో అక్కిరెడ్డిపాలెం బాక్సింగ్ క్లబ్ విద్యార్థులు ప్రతిభ చూపి మన ప్రాంతానికి పేరు తీసుకువచ్చారన్నారు. సీనియర్ కేటగిరీలో 70 కిలోల విభాగంలో డి.అరుణ బంగారుపతకం, 58 కిలోల విభాగంలో ఎస్.జయంత్ కాంస్య పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోచ్ డి.హరీష్, ఆర్.వెంకట ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ

రోలుగుంట: జగ్గంపేట ఎంపీపీ పాఠశాలకు గ్రామానికి చెందిన యువకులు తమ సొంత నిధులతో రూ.35 వేల విలువ గల టీవీని హెచ్ఎం కాళింగ సతీష్‌కు అందజేశారు. బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను బళ్లో చేర్పించేలా తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించి పాఠశాలలో చేర్పిస్తున్నారు.